# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ప్రజల రుణం తీర్చుకోలేనిది
- మంత్రి దనసరి అనసూయ సీతక్క
- ఆది దేవత గట్టమ్మకు పూజలు


గట్టమ్మ తల్లిని దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, డిసెంబర్ 17 : అధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంతోపాటు రాష్ట్ర అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆదివారం తొలిసారి సీతక్క ములుగు జిల్లా కేంద్రానికి రాగా మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి, మల్లంపల్లి, జాకారం మీదుగా గట్టమ్మ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఆది దేవత గట్టమ్మకు మొక్కులు చెల్లించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తన 20 ఏళ్ల రాజకీయ జీవితం, అంతకు ముందు ఉన్న ప్రజా ఉద్యమ జీవితంలో తాను ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజల సేవలోనే ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు, నాయకులు, అభిమానుల రుణం తీర్చుకోలేనిదన్నారు. మారుమూల ప్రాంతంలోని పేద కుటుంబానికి చెంది తనను ప్రజలు ఆశీర్వదిస్తూ మంత్రి స్థాయికి తీసుకువచ్చారన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉండడం బాధ కలిగిందని, సొంత గడ్డపై అడుగు పెట్టిన అనంతరం బలంతో పాటు ఊపిరి వచ్చిందని తెలిపారు. ప్రజల కష్ట సుఖాల్లో తాను పాలు పంచుకుంటానన్నారు. ప్రతి ఇంటి ఆడబిడ్డగా ఉంటూ ఎలాంటి కష్టం రాకుండా చూసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని తెలిపారు. మేడారం జాతరకు గత అంచనాల మేరకు రూ.75 కోట్లు విడుదల చేశామని, జాతర విజయవంతానికి కృషి చేస్తానన్నారు. తాను ఎంత ఎదిగినా ప్రజల వద్ద ఒదిగి ఉంటానని సీతక్క తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు వంగ రవియాదవ్, గొల్లపల్లి రాజేందగౌడ్, బానోత్ రవిచందర్, రాంరెడ్డి, మేకల ప్రశాంత్, శ్రీకాంత్‌రెడ్డి, రవికుమార్, బాదం ప్రవీణ్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్సై అశోక్

## చేయూత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వెంకటాపురం (నూగురు), డిసెంబర్ 17 : మండలంలోని వీఆర్‌కేపురం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 20 మంది యువకులు రక్తదానం చేయగా, వారికి ఎస్సై అశోక్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఎంతో ఉపయోగమన్నారు. రక్తదానం చేసిన వారిని, శిబిరం నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షురాలు పూనెం శ్రీదేవి, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి డర్ర దామోదర్, పల్నాటి కిషోర్, రావుల నాని, రాంప్రసాద్, నాగేశ్వర్‌రావు, దినేశ్, సతీశ్, రవి, శ్రీను, నరేందర్, గుండమల్ల మధు, వెంకటేశ్, ఆది, పార్థు తదితరులు పాల్గొన్నారు.

### మానవ హక్కుల సంఘం
## రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ రవీందర్

ములుగు రూరల్, డిసెంబర్ 17 : మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ పోరిక రవీందర్ నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ళ భద్రయ్య నియామక పత్రాన్ని అందజేశారు. రవీందర్ మాట్లాడుతూ మానవ హక్కుల కోసం తన వంతుగా కృషి చేయనున్నట్లు తెలిపారు. నియామకానికి సహకరించిన భద్రయ్యకు, సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.


రవీందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న భద్రయ్య

## స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

వెంకటాపూర్,డిసెంబర్ 17 : తమతో పాటు పదో తరగతి వరకు చదువుకొని ఇటీవల మృతి చెందిన మండలంలోని పాలంపేటకు చెందిన తౌటం దయాకర్ కుటుంబానికి మిత్రులు చేయూతనిచ్చారు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 12 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బుర్ర సమ్మయ్య, తుమ్మేటి రాజిరెడ్డి, అకినపెల్లి నాగరాజు, పైండ్ల ప్రసాద్, సుద్దాల రమేశ్, ఆక ర వి, సరిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దయాకర్ కుటుంబ సభ్యులను సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా పరామర్శించి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే గంపోనిపల్లికి గ్రామానికి చెందిన గంప కొంరెల్లి అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

## 21న జిల్లా స్థాయి యువజన పోటీలు

ములుగు రూరల్, డిసెంబర్ 17 : మండలంలోని జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకులం ఆవరణలో ఈ నెల 21న జిల్లాస్థాయి యువజన పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి క్రీడల అధికారి కే వెంకయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక, జీవన నైపుణ్య విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత అర్హులని, పూర్తి వివరాలకు 9398744428 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## రేపు లక్నవరం తైబందీ సమావేశం

గోవిందరావుపేట, డిసెంబర్ 17 : మండలంలోని లక్నవరం సరస్సు కింద రైతులు సాగు చేసుకునేందుకు యాసంగి తైబందీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు డీఈ చిదిరాల శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించనున్న సమావేశానికి రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.


వెంకటాపూర్ : రామప్పలో దర్శనం కోసం బారులు తీరిన విద్యార్థులు


రామప్ప శిల్పాలను తిలకిస్తున్న మహబూబాబాద్ కలెక్టర్ శశాంక దంపతులు

# రామప్పలో పర్యాటకుల సందడి

- సందర్శించిన మహబూబాబాద్ కలెక్టర్ శశాంక దంపతులు
- మల్లూరుకు పోటెత్తిన భక్తులు


వెంకటాపూర్, డిసెంబర్ 17 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు పదివేల మంది పర్యాటకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు.

### మహబూబాబాద్ కలెక్టర్ దంపతుల పూజలు

మహబూబాబాద్ కలెక్టర్ శశాంక దంపతులు ఆదివారం రామప్పను సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో వారిని శాలువాలతో సన్మానించి, ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ప్రాముఖ్యతను గైడ్స్ ద్వారా తెలుసుకున్న కలెక్టర్ శిల్పకళ అద్భుతమని కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేశారు. వారివెంట దేవాదాయ, టూరిజం, పురావస్తు, రెవెన్యూ శాఖల సిబ్బంది ఉన్నారు.

### మల్లూరులో..

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలోతరలివచ్చారు. ఉదయాన్నే అర్చకులు శ్రీలక్ష్మీనర్సింహస్వామిని పూలదండలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సంప్రదాయ పూజా క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు గుట్టకు చేరుకొని దైవదర్శనం చేసుకున్నారు. భక్తులు ముందుగా చింతామణి జలపాతాన్ని సందర్శించారు. అనంతరం స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి



### లక్నవరంలో..

గోవిందరావుపేట : మండలంలోని లక్నవరం సరస్సును పర్యాటకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో సందర్శించడంతో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వేలాడే వంతెనలపై నడుస్తూ, ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. పెద్ద, స్పీడ్ బోట్లలో షికారు చేస్తూ లక్నవరం అందాలను చూస్తూ ఫిదా అయ్యారు.

పెద్ద బోటులో ప్రయాణిస్తున్న విద్యార్థులు